# "మురిపెమా ఏది నీ చిరునామా"

-మీనాక్షి శ్రీనివాస్

ట్రింగ్... ట్రింగ్... ఫోను అదే పనిగా మ్రోగుతోంది.

'అబ్బ ఏం ఫోన్... సెలవు రోజయినా ఒక్క నిముషం కూర్చోడాని కుండదు' వంటింట్లో పనయి ఇక కాసేపు పడుకుందాం అనుకుంటున్న దివ్య విసుక్కుంది.

హలో... ఎవరూ? ఆ... మీరేనా?... ఏమిటీ సాయంత్రం పార్టీనా.... ఓకే నేనూ పిల్లలూ రెడీ అయి వుంటాము.

ఏమిటీ పార్టీకి మేవంతా లేవూ? సరేలెండి... ఆ మాత్రం దానికి సారీ ఎందుకు... సరె... సరె... త్వరగా వచ్చెయ్యండి.

సరే నేనెటూ లీవు పెట్టాకదా సాయంత్రం పిల్లల్ని తీసుకుని సరదాగా ఎటైనా వెడదాం అనుకున్నా... సరేలెండి... కుదరకపోతే పాపం మీరు మాత్రం ఏం చేస్తారు. త్వరగా వచ్చెయ్యండి... ఓకే ఉంటా.

ఫోను క్రెడిల్ చేసి ఉసూరుమంది దివ్య.

సరేలే కాసేపు రెస్ట్ తీసుకుంటే పోలా... పిల్లలు వచ్చే దాకా అనుకుంటూ బెడ్‌రూమ్ వైపు వెళ్ళబోయిన దివ్యకు 'అమ్మగోరూ' అన్న రాములమ్మ పిలుపు వినబడింది.

దిగబడ్డావా తల్లీ... అంటూ తలుపుతీసి ఏమే నిన్న రాలేదు మళ్ళీ నీ మొగుడు ఉతికి ఆరేసాడా నిన్ను... అడిగింది పనిమనిషి రాములమ్మని.

మామూలే కదమ్మా... నీరసంగా... పేలవంగా అంది రాములమ్మ. ఎందుకొచ్చిన బ్రతుకే అది... వాడెటూ నిన్ను పోషించడు, నువ్వు రెక్కలు ముక్కలు చేసుకు సంపాదించినది తన్ని లాక్కుపోవడం, తాగి తగలెయ్యడం. వాడ్ని వదిలేసి నీ బిడ్డతో హాయిగా నీ బతుకు నువ్వు బతుకు. ఎప్పుడూ యిచ్చే సలహానే మళ్ళీ యిచ్చింది దివ్య.

ఏటోలే అమ్మా... ఎంత తాగినా ఆడికి నేనంటే ఒల్లమాలిన పేమ. తాగితే అట్టుంటాడుకానీ నేకపోతే పువ్వుల్లో పెట్టి సూసుకుంటాడు. అమాయకత్వంతో కూడిన ఆశ రాములమ్మది.

అలాగే భ్రమలో బతుకు గడిపెయ్. సుమారుగా పదేళ్ళుగా చూస్తున్నా వాడు తాగనిదెప్పుడూ... నిన్ను ప్రేమగా చూసుకున్నదెప్పుడు? నీకు తెల్సినప్పటి నుండీ ఇదే బాగోతం కదే... సర్లే... ఈ రెండురోజులుగా ఏమైనా తిన్నావా? నడు ముందు కాస్త తిండి తిని అప్పుడు చేద్దూగాని... పని. ఆర్ద్రంగా అంది దివ్య.

ఏంటో తల్లీ... సూసిన ఏలా ఇశేషమేటో కానీ నన్ను తోడబుట్టిన దానిలా ఆదరిస్తావు. నాకేటొద్దు కాని... ఏమైనా ఉంటే యియ్యండమ్మా యింటికట్టుకెల్తా... నా బిడ్డకెడతా... మా బాగోతానికి మద్దెన ఆడు బెదిరిపోతున్నాడు. ఎర్రి సన్నాసి... నిన్న నా దెబ్బతాపబోయి ఆడు దెబ్బలు తిన్నాడు ఎర్రి నాగన్న... 'కొడుకు మీద ప్రేమతో కళ్ళు చెమర్చాయి రాములమ్మకు. సరె సరె... రా నువ్వు తిను ముందు. వెళ్ళేటప్పుడు వాడికీ యిస్తాలే...

అవునూ... ఈ ఏళప్పుడు తమరున్నారేటి



యింటికాడ... ఆఫీసుకెల్లలేదా... పానం గాని బాగానేదా ఏటి... ఆదుర్దాగా... ఆప్యాయంగా అడిగింది రాములమ్మ.

ఒంట్లో బాగానే వుంది. ఈ వేళ ఎందుకో వెళ్ళాలనిపించలేదే... ఎటూ సెలవలుండిపోయాయికదా అని... అదీకాక బాబిగాడి పుట్టినరోజొస్తూంది, అలా బజారుకు అదీ వెడదామని సెలవు పెట్టేశా... తీరా చూస్తే అయ్యగారికేదో పార్టీ వుందట... రావడం ఆలస్యమవుతుందని యిప్పుడే ఫోను చేసి చెప్పారు... రాములమ్మకు అన్నం పెడుతూ చెప్పింది దివ్య.

అడపాదడపా యిలా నాగాలు పెట్టినా పని శుభ్రంగా, బాధ్యతగా చేసి అభిమానించే రాములమ్మ అంటే దివ్యకూ... తనని పనిమనిషిలా కాక ఆప్యాయంగా చూసి... తన అవసరాలు కనిపెట్టి వుండే దివ్య అంటే రాములమ్మకూ మంచి అవగాహన... చక్కని అనుబంధం.

అమ్మా... పనయిపోనాది నే నెల్తన్నా... చెప్పిన రాములమ్మకు ఈ కారేజీ తీసుకెళ్ళు.... నాగరాజుకు పెట్టు... పిల్లాడికే పెట్టు సుమీ జాగ్రత్త... మధ్యలో ఆ తాగుబోతాడు లాక్కుంటాడేమో... కోపంగా అంది దివ్య.

అబ్బ... రాత్రి పదకొండు కావస్తోంది. ఈయనింకా రాలేదేమిటో చెప్మా. ఇంతరాత్రి వరకూ ఎప్పుడూ రాకుండా లేరు. చదువుతున్న పుస్తకం విసుగ్గా పడేసి నిద్రపోతున్న పిల్లలను ముద్దాడింది దివ్య.

వెధవలు... ఎంత అమాయకంగా నిద్రపోతున్నారో... మెలకువగా ఉన్నంతసేపు యిల్లు తీసి పందిరేస్తారు. ఏమిటో ఇటు ఇంట్లో పని... అటు ఆఫీసు. పాపం వాళ్ళతో సరిగా గడపలేకపోతోంది తను. ఎందుకొచ్చిన ఉద్యోగాలో. ఏదో నాలుగు రాళ్ళు కళ్ళబడతాయనే కానీ సుఖమా... శాంతా? ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకుంది దివ్య.

నెమ్మదిగా కళ్ళు మూతలు పడుతుండగా యింటి ముందు కారు ఆగిన శబ్దం. కారులో దిగబెట్టేరులా వుంది. రాత్రయిందని. పోనీలే అదయినా నయం అర్ధరాత్రి స్కూటర్ మీద ఒంటరిగా రావడంకంటే...

దివ్యా... దివ్యా డార్లింగ్... పెద్దగా అరుస్తూ తలుపు బాదుతున్నాడు శ్రీధర్.

అర్ధరాత్రి ఆ గావుకేకలేమిటో... వస్తున్నా... ఒక్క నిముషం ఆగలేరూ... అంటూ తలుపు తీసిన దివ్య నిర్ఘాంతపోయింది. సారీరా దివ్యా... షాలా లేట్ అయింది... అంటూ నిలబడలేక తూలిపోతున్న భర్త స్థితి అర్థం కాగానే దివ్య గుండె గుభేల్మంది.

మీరు... మీరు తాగి వచ్చారా? అపనమ్మకంగా అడిగింది దివ్య.

సారీ డియర్... పార్టీలో విశ్వంగాడు బాగా బలవంతపెడితేనూ... కొంషం... జస్ట్ కొంషం తాగానంతే... అక్కడకూ చెప్పా... మా దివ్యకు యిష్టం ఉండదూ... బాధ పడుతుందీ అని... వాడు మరీ మొహమాటపెట్టేశాడు వెధవ...

బలవంతంగా కోపం దిగమింగుకున్న దివ్య..

సర్లెండి రండి బట్టలు మార్చుకోండి, స్నానం చేద్దురుగాని వేడినీళ్ళున్నాయి.

అబ్బ అర్ధరాత్రి యిప్పుడు షానం ఏమిటి డార్లింగ్ పొద్దుట చేస్తాలే అంటూనే అక్కడున్న సోఫాలో అడ్డం పడ్డాడు శ్రీధర్.

ఛ... ఛ... ఎవడీ విశ్వం... ఇంతకు ముందెన్నడూ ఆ పేరు వినలేదు ఈయన దగ్గర... వీడెవడో... ఎలాంటివాడో మొదటిరోజే అర్థం అయింది. ఎలాగయినా రేపు ఈయనకు గట్టిగా చెప్పాలి అలాంటి వాళ్ళతో సావాసం చెయ్యొద్దని... ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రపోయింది దివ్య.

అమ్మా... లేమ్మా... మా స్కూల్కి టైము అవుతోంది. ఎందుకలా పడుకున్నావ్ యింకా... వంట్లో బాగా లేదా... మీదకు వాలి కుదిపి కుదిపి అడుగుతున్న ధీరజ్, దీపక్లను అయోమయంగా చూస్తున్న దివ్యను... చానా పొద్దోయింది యింక నెగనేదేటియాల... అంటున్న రాములమ్మ గొంతుతో స్పృహలోకొచ్చింది.

అరె అప్పుడే టైము ఎనిమిదయిందా? ఏమిటీ మొద్దునిద్ర... రాత్రి జరిగింది గుర్తు వస్తూనే మనసు కలత చెందింది... ఏరీ ఈయన... ఇంకా

సోఫాలో అలాగే నిద్రపోతున్నారు. బిత్తరపోయి చూస్తున్న పిల్లలను చూసి బలవంతంగా నవ్వుతూ... గుడ్ మార్నింగ్ చిల్డ్రన్. రాత్రి పడుకునేటప్పటికి బాగా లేట్ అయింది. అందుకే మెలకువ రాలేదు. పొండి... పోయి త్వరగా రెడీకండి... ఇదుగో నేనూ చిటికెలో తయారయి మీకు బ్రేక్ ఫాస్ట్ రెడీ చేస్తా... పిల్లలను చకచక రెడీ చేసి స్కూల్ బస్ ఎక్కించి... యింకా నిద్రపోతున్న శ్రీధర్‌ను బలవంతంగా లేవదీసి బాత్‌రూమ్‌లోకి నెట్టింది.

సారీరా దివ్యా! రాత్రి చాలా పొరపాటు జరిగింది. విశ్వం అనీ నా కాలేజ్ ఫ్రెండ్. అనుకోకుండా కలిశాడు. ఎంత చెప్పినా వినకుండా పార్టీ... పార్టీ అని లాక్కెళ్ళాడు. తీరా చూస్తే డ్రింక్ పార్టీ... అలవాటు లేదని ఎంత మొత్తుకున్నా వినలేదు. పైగా మీ ఆవిడ అంటే నీకు అంత భయమా గురూ అంటూ ఎద్దేవా చేశాడు... ఇంక తప్పలేదు. గిల్టీగా అన్నాడు శ్రీధర్.

అంటే అన్నాడు... మీరు తాగకుండా ఉండవలసింది. ఇటువంటివి సరదాగా మొదలయి.... దుఃఖంతో గొంతు పూడుకుపోయి మాటరాలేదు దివ్యకు.

ఛ... ఛ... మరీ అంత అప్‌సెట్ అవుతావేమిటీ... నాకు తెలియదా! ప్రామిస్, నీకు అంత కష్టం కలిగించే పని నేను ఈ జన్మలో చెయ్యను. నవ్వు... ఏదీ నవ్వాలి అంటూ దివ్యను దగ్గరకు తీసుకున్నాడు శ్రీధర్. భగవంతుడా... అన్యోన్యంగా... హాయిగా ఉండే మమ్మల్ని కలకాలం ఇలాగే ఉండనీ తండ్రీ... ఏ దుష్ట... దురదృష్టపు నీడా మామీద పడనీయకు తండ్రీ అనుకుంటూ అలాగే శ్రీధర్ గుండెల్లో ఒదిగిపోయింది.

కానీ దివ్య మొర దేముడు ఆలకించలేదు. రోజులెప్పుడూ ఒకేలా వుంటే... కాలం గొప్పతనమేముంది. రోజులు గడుస్తున్నాయి. ఒక్కరోజు చేసిన పొరపాటు హాయిగా సాగుతున్న వాళ్ళ జీవనగమనాన్నే మార్చేసింది... విశ్వం.... శ్రీధర్‌ని పక్కా తాగుబోతుగా మార్చేశాడు. ఇప్పుడు దివ్య లేదు... పిల్లలు లేరు...యిల్లు లేదు... ఆఫీస్ లేదు... విశ్వం... బాటిల్ యివే శ్రీధర్ ప్రపంచం.

ఈ బలహీనతను అడ్డుపెట్టుకుని విశ్వం... శ్రీధర్ చేత ఆఫీసుకు సంబంధించిన ఎన్నో పనులు అవకతవకలుగా... తనకు అనుకూలంగా చేయించుకుంటున్నాడు. బాధ్యతాయుతమైన పదవిలో వుంటూ మత్తులో మునిగితేలుతూ ఉచ్చం, నీచం మరచి... విశ్వం చేతిలో కీలుబొమ్మ అయిన శ్రీధర్... ఉద్యోగం ఊడటానికెంతో కాలం పట్టలేదు. ఇంక శ్రీధర్ తనకు పనికిరాడు అని తెలిసిన మరుక్షణం మరి అయిపు, జాడ లేదు. చేతిలో సొమ్ములేదు. అలవాటయిన మందు పడకపోతే శ్రీధర్ ప్రాణాలు పోయినంత పనై... మృగమే అయిపోతున్నాడు.

చేతికందిన అప్పులు చేశాడు... విషయం అర్థమై అందరూ యివ్వడం కూడా మానేసారు. తిరిగి అతనిని మనిషిని చెయ్యాలని చూసిన దివ్య ఆశ... నిరాశే అయింది.

అమ్మా... నా నీడ పడి నీ బతుకిట్టా అయిపోయిందా తల్లీ... నా దురదృష్టం నిన్ను కూడా కాటేసిందా అమ్మా... అంటూ గుండెలవిసేలా ఏడుస్తున్న రాములమ్మను తిరిగి దివ్యే ఓదార్చాల్సి వచ్చింది.

ఏమిటదీ... ఏయ్ పిచ్చి రాములమ్మా... నీ నీడపడటం ఏమిటీ? దురదృష్టం... ఆ విశ్వం రూపంలో మనల్ని చేరింది. అయినా మన బంగారం మంచిదయితే ఒకర్ననాల్సిన పనేముందిలే... నిర్లిప్తంగా అంది దివ్య.

'అమ్మా... నేనోమాట చెప్పనా... తవరెప్పుడూ అనేటోరు... గొడ్డు సాకిరి చేసి... నీ రెక్కలు

## కామ్రేడ్

దండికి జండా కట్టి
యజాన్ని భుజాన మోసే
సోషలిస్టు సోదరుడు

– శిల్పా జగదీష్

ముక్కలు చేసుకుని వాడినీ... వాడి తాగుడినీ ఎందుకే పోషిస్తావ్... భరిస్తావ్ అని... మరి... మరి మీరెందుకమ్మా అదే పని సేత్తన్నారు... నేను మీ కట్టం సూడలేకున్నా. తమరు పిల్లలతో హాయిగా సుకంగా బతకండమ్మా... ఎల్లిపొండమ్మా బాబుగారికి దూరంగా... పోయి హాయిగా బతకండి' ఆవేశంగా అంది రాములమ్మ.

రాములమ్మా... నీకు సలహా యిచ్చినప్పుడు తెలియులేదే అదెంత కష్టమో... ఇప్పుడు అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను అది కుదరని పనని. ఈయన ఏదో మనిషి సాయంగా వున్నప్పుడే నన్ను నలుగురూ నానారకాలుగా ఏడిపిస్తున్నారు సంఘంలో. యిదివరకటి రక్షణ లేదు. గౌరవం లేదు. మరి పూర్తిగా దూరమయిపోతే ఈ తోడేళ్ళు నన్ను బతకనీయవే...

భయపడితే... మరింత భయపెడుతుంది తల్లీ ఈ లోకం.... మీరు సదువుకున్నోళ్ళు... ఎన్నాళ్ళిలా ఈ నరకంలో ఉంటారు. ఆ బాబు మీ మొకం సూడటమే మానేసినాడు. పొద్దుగూకులు తాగి తందనాలాడుతున్నాడు. పైసలకు మాత్రం... మీ దగ్గర దాసిపెట్టినట్లు లాక్కుపోతుండాడు. బిడ్డల మొకంలో మీ మొకంలో నవ్వు నూసి ఎన్నాళ్ళయ్యిందమ్మా నా గుండె తరుక్కుపోతాంది... ఒకింత కోపంగా అంది రాములమ్మ.

నిజమే!... యింట్లో అడిగితే లేదంటాననీ... యివ్వనంటాననీ నరాసరి ఆఫీసుకే వచ్చి అడుగుతుంటే... పదిమందిలో కక్కలేక... మింగలేక... నా కష్టార్జితం అంతా ఆయన చేతుల్లో పోసి ఇలా... పిల్లలూ... నేనూ... తినీ... తినకా బావురుమంది దివ్య...

అదేనమ్మా.... మీ గొప్పోల్లతో వచ్చిన సిక్కు... పరువు... పరువు అంటూ పాకులాడతరు... ఏందమ్మా... పరువంటే.. బిడ్డలను పస్తులుంచడమా... పరువు?... శవం నాగా బతుకీడ్చడమా పరువు అంటే... నాను పరువు కోసం వాడితో కలిసి ఉండటం లేదమ్మా... ఏనాటికయినా ఆడు మారతాడనే ఆశతో ఉంటన్నాను. ఇంక ఆ ఆశా లేదు. ఆడు సెడిందే కాక నా బిడ్డని కూడా సెడగొడతా వున్నాడు. మొన్నటికి మొన్న మా నాగరాజు నేస్తాలతో బీడీ కాలుస్తూ కనబడ్డాడని మా పక్కింటి గౌరి సెబితే నాను నమ్మలేదు. నిన్న... నాను గుడిసె కెల్లే తలికి... ఆ దొంగ సచ్చినోడు... ఈడు కలిసి తాగుతున్నారమ్మా... బొడ్డూడని పసాడికి తండ్రి దగ్గరుండి తాపిత్తన్నాడంటే... గొల్లుమంటున్న రాములమ్మను చూస్తూ నిశ్చేష్టురాలైంది దివ్య.

నిజమా... నిండా పన్నెండేళ్ళయినా లేని నాగరాజు... అమాయకంగా తల్లి కొంగట్టుకు తిరిగే నాగరాజు... తాగడమా... ఆ ఊహే భరించలేకపోయింది దివ్య.

నిజమే... మగపిల్లలు సాధారణంగా తండ్రినే అనుకరిస్తారు... అనుసరిస్తారు.. మంచి అయినా... చెడు అయినా వాళ్ళ నుంచే నేర్చుకుంటారు. మరి తన పిల్లలు... వాళ్ళూ పెద్దవుతున్నారు. అమ్మో... మనసు అల్లకల్లోలమవసాగింది అలజడితో.

అయినా దివ్యమ్మతల్లీ... ఈ మొగాళ్ళంతా యింతేలేమ్మా... ఆళ్ళు సెడుతున్నారని తెలిసీ సెడతానే వుంటారు... ఆళ్ళకి పెళ్ళాం బిడ్డలకంటే ఆ మహమ్మారి తాగుడే ఎక్కువమ్మా... దాన్ని ఒగ్గేసి ఆళ్ళు బతకనేరమ్మా... నా తండ్రి యిట్టా... తాగి... తాగి... సచ్చి ఊరుకున్నాడు. నా అన్నదమ్ములు తాగి తందనాలాడుతున్నారు... అయినా ఏదో ఆశ... కన్న కడుపు తీపి... ఈళ్ళు మనసేతిలో ఉన్నన్నాళ్ళూ అయినా ఆ మహమ్మారికి దూరంగా ఉంటే... రేపు ఆడు పెద్దయ్యాక... ఏమో మరి ఆడదురుట్టం ఎట్టుందో ఏమో. నా మాట విని... మీరు పిల్లలతో ఎట్టైనా దూరంగా బదిలీ సేయించుకుని హాయిగా బతకండి తల్లీ... అందుకేనమ్మా... నేను నా బిడ్డని తీస్కొని ఈ రాతిరికే మా అమ్మోళ్ళింటికిపోతన్నా... ఇక్కడ చేసే కష్టం అక్కడ సేత్తా... నా బిడ్డని ఈ విషప్పురుగుకి దూరంగా పెంచుతా... తల్లి గా నే సేయగల్గింది సేత్తా... ఆపై... ఆ దేవుడిదయ... వాడదురుట్టం...

రెండు రోజులయినా రాములమ్మ మాటలు

చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి దివ్యకు.

రోజులు అలా గడుస్తూనే వున్నాయి. ఓరోజు సాయంత్రం ఆఫీసునుండొచ్చే సరికి 'ఒరే దీపక్... ఇది తాగితే బోలెడు బాగుంటుందట... నాన్న చెప్పాడు. అమ్మ తిట్టే తిట్లు, ఏడుపు అవేవీ వినిపించవట...' అంటున్నాడు ధీరజ్.

అవునురా... అమ్మ ఈ మధ్య అస్తమానం ఊరికే మనల్ని తిడుతోంది... మళ్ళీ అస్తమానం ఏడుస్తోంది... మన యిల్లు అస్సలు బాగుండటం లేదురా... అమ్మా... నాన్న... మనం కలసి హాయిగా వుండి ఎన్నాళ్ళయిందో... యివన్నీ బాధ లేగా... మరి ఇది తాగితే మనకు బాధలన్నీ తీరిపోయి హాయిగా ఉంటామా?

అసలే పెద్దకళ్ళను యింకా పెద్దవి చేసి అమాయకంగా అంటున్న ధీరజ్‌ను వాడి ముందున్న బాటిల్‌ను చూసేసరికి దివ్యకు గుండాగినంతపనైంది. వాళ్ళను చంపెయ్యాలి అన్నంత ఆవేశంగా ముందుకు రాబోయిన ఆమెను వివేకం చెయ్యిపట్టి ఆపింది.

అవును, ఏది మంచో... ఏది చెడో ఆ పసివాళ్ళకేం తెలుసు... వాళ్ళ పక్కనే చిత్తుగా తాగి... వాగుతున్న శ్రీధర్ మీద అసహ్యంతో... విరక్తితో దివ్య మొద్దుబారిపోయింది. కళ్ళలో ఉబుకుతున్న నీళ్ళను గొంతులో దిగమింగుకుని ఏమీ ఎరుగనిదానిలా...

అరె బంగారుతండ్రులూ... ఏం చేస్తున్నారు... రండి... రండి మీ కోసం ఏం తెచ్చానో చూడండి అంటూ ప్రేమగా పిలిచింది... దివ్య. అంత ప్రేమగా తల్లి దగ్గరకు పిలిచి ఎన్నాళ్ళయిందో.. ఆర్తితో అల్లుకుపోయారు పిల్లలు.

అరె... ఎంత తప్పు చేస్తున్నాను నేను... తప్పు చేసింది ఎవరు? శిక్షవేస్తున్నదెవరికి? ఆయన మైకంలో ఆయన. నా దుఃఖంలో నేనూ ఉండిపోయి అన్నెం పున్నెం ఎరుగని వీళ్ళనెంత అలక్ష్యం చేస్తున్నానో... అది వాళ్ళ చిన్నిగుండెలనెంత గాయం చేస్తోందో తెలిశాక దివ్య ఎందుకిలా జరిగింది అని కుమిలిపోవడం కాక యిప్పుడు కర్తవ్యమేమిటీ అన్న ఆలోచన మొదలయింది.

చాలారోజుల తర్వాత. కాఫీ కప్పు తనకందిస్తున్న భార్యకేసి చూడలేక తలదించుకు కాఫీ త్రాగసాగాడు శ్రీధర్.

'నాకు... నాకు డైవోర్స్ కావాలి' అంటున్న దివ్యను ఆశ్చర్యంతో నోటమాట రాక చూస్తూండిపోయాడు. తను చెప్పిన మాట అతను జీర్ణం చేసుకోవడానికి కొంచెం సమయం యిస్తూ త్వరత్వరగా తెమిలి ఆఫీసుకెళ్ళిపోయింది దివ్య.

ఒంటరిగా యింట్లో మిగిలిన శ్రీధర్‌కు భార్య నెమ్మదిగా చెప్పినా స్థిరంగా, ఖచ్చితంగా అన్న ఆ రెండు మాటలూ చెవుల్లో మారు మ్రోగుతున్నాయి. లేచి గదిలో అద్దం ముందు నిల్చున్న శ్రీధర్‌కు తన మొహం తనకే భయం గొల్పేలా వికృతంగా కనబడింది. ఏం చేస్తున్నాడు తను... హాయిగా ఉండే తమ మధ్య యిలాంటి స్థితికి కారణమెవరు? అంతరాత్మ... ప్రతిబింబం రూపంలో వెక్కిరించి వికటాట్టహాసం చేసింది. ఇంకెవరు... నువ్వే... నువ్వే... అంటూ.

అర్థం లేకుండా తను గడిపిన ఈ ఆర్నెల్ల కాలం తన పొదరింటిని ఎలా ఛిన్నాభిన్నం చేసింది.

పాపం దివ్య... తననెంతగా ప్రేమించింది. తనకోసం తన వాళ్ళందరినీ వదిలి వచ్చిన తన దివ్య నెలా యింత బాధపెట్టగలిగాడు? ఈ వ్యసనాన్ని వదిలేయమని... తనెంత ప్రాధేయపడింది. నచ్చచెప్పింది. తను వినకపోగా ఎంత రాక్షసంగా ప్రవర్తించాడు... కాబూలీవాలా లాగా ఒకటో తారీఖు ఆఫీసుకెళ్ళి మరీ... ఛ.. ఛ.. ఏమైంది తనకు... ఎంత మనసు విరిగిపోతే తన దివ్య తననుండి విడిపోవాలని కోరుకుంటుంది.

మారాలి... తను మారాలి. తప్పకుండా తనకోసం... తనవాళ్ళకోసం ఈ వెధవ అలవాటు మానేయాలి. ఏదో ఉద్యోగం దొరకకపోదు... ఈ నిర్ణయంతో తెరిపిన పడింది శ్రీధర్ మనసు.

చాలా రోజుల తర్వాత ఫ్రెష్‌గా తయారయి, పిల్లలను స్వయంగా స్కూల్ నుంచి తీసుకొచ్చి తయారు చేశాడు. దివ్యను తీసుకురావడానికి ఆఫీసుకు వెళ్ళాలనుకునీ... మళ్ళీ కొన్ని నెలలుగా

తన ప్రవర్తన గుర్తొచ్చి ముఖం చెల్లక దివ్యకోసం ఎదురుచూస్తూ యింట్లోనే వున్నాడు.

పిల్లలతో క్యారమ్స్ ఆడసాగాడు. ఏవో ఆలోచనలతో సతమతమవుతూ అలసటగా యింటికొచ్చిన దివ్యకు ఒక్కక్షణం తను చూస్తున్నది కలో నిజమో అర్థం కాలేదు.

అమ్మా అంటూ ఆనందంగా తనను పెనవేసిన పిల్లలనూ... కాస్తంత గిల్టీనెస్‌తో ఫ్రెష్‌గా తయారయి... ప్రేమగా తనకేసి చూస్తున్న శ్రీధర్‌ను చూడగానే దివ్యకెంతో ఆనందమయింది.

చాలా రోజుల తర్వాత ఆలుమగల మధ్య అన్యోన్యత తొంగిచూసింది. తనని క్షమించమనీ... ఇంకెప్పుడూ తాగననీ... తనను విడిచిపోవద్దనీ పసివాడిలా బేలగా అడుగుతున్న భర్తను... మనస్ఫూర్తిగా క్షమించి అతనిలో కరిగిపోయింది దివ్య.

నాలుగు రోజులు గడిచాయి. అలవాటు ఎంత ప్రమాదకరమో... అది మానడమనేది ఎంత నరకయాతనో అనుభవపూర్వకంగా తెలిసివచ్చింది శ్రీధర్‌కు. ఖాళీగా కూర్చున్న అతనికి... వివేకం పూర్తిగా నశించింది. వ్యసనానికి అలవాటు పడటం తన తప్పు అయినా... దాన్ని అధిగమించలేక... దివ్యమీద లేనిపోని నిందవేసి... కార్పణ్యంతో ప్రవర్తిస్తూ... త్రాగకుండా వుండలేని తన దుస్థితికి కారణాలు సృష్టించుకుంటూ... మళ్ళీ... మళ్ళీ... తప్ప తాగడం మొదలుపెట్టాడు.

మారాడనుకున్న భర్త, మళ్ళీ మృగమవడం చూసి ఏడవడానికి సయితం ఓపిక లేకపోయింది దివ్యకు.

ఎవరో మహానుభావుడన్న వాక్యాలు గుర్తొచ్చాయి దివ్యకు...

"ఎండమావుల్లో నీళ్ళు ఉండనే ఉండవు... తాగుబోతు వాడి భార్య కళ్ళల్లో నీళ్ళు ఎండనే ఎండవు." ఎంత బాగా చెప్పాడు. నిజమే ఏ వ్యసనమైనా అలవాటు కాకపోవడమే అదృష్టం. అలవాటయితే దాన్ని మానుకోవడం... మార్చుకోగలగడం... ఎక్కడో... మందిలో ఏ ఒక్కరికో సాధ్యం.

అతను మారలేదు సరికదా... తను మారలేకపోతున్నందుకు, తన అసమర్థత కప్పిపుచ్చుకుందుకూ... దివ్య మీద లేనిపోని అభాండాలేసి తనను మోసం చేసిందనీ... అందుకే అది తట్టుకోలేకే తను తాగుబోతయ్యాననీ... నానారకాలుగా దుష్ప్రచారాలు చేసి దివ్యను మానసికంగా హింసించడం మొదలుపెట్టాడు.

మనిషిని చంపితే హత్య అంటారు. హంతకుడంటారు. మరి మనసుని చంపితే... ఏమంటారు? దానికి శిక్షేది? దివ్యను మానసికంగా చిత్రవధచేసి... వినోదించడం మొదలుపెట్టాడు శ్రీధర్. యింత జరుగుతున్నా... తనొక్క మాట అనని దివ్య మీద కక్షతో... శ్రీధర్ ఆమెను హింసించడానికి అతి దారుణమైన మార్గం ఎంచుకున్నాడు. వ్యసనం మనిషిని నైతికంగా ఎంత పతనం చేస్తుందో తెలియడానికి చక్కని తార్కాణం శ్రీధర్. తల్లిని హింసించడానికి బిడ్డలను ఆయుధం చేసుకున్న ఆ మూర్ఖుడిని... ఒరే తాగితే భలే బాగుంటుంది తాగండి అంటూ తన చేతులతో కొడుకులకు, ముక్కుపచ్చలారని పసివాళ్ళకు మందుపోస్తున్న భర్తను చూసి చేష్టలుడిగి అవాక్కయిపోయింది దివ్య.

ఇంక భర్త మారడనీ... అతని దగ్గరుండటం తనకూ, పిల్లలకూ ఎంతైనా ప్రమాదమనీ తలచి తక్షణం లాయర్‌ని సంప్రదించింది దివ్య. ఊరంతా తెలిసిన తాగుబోతు అవడం వలన 'ఆ' కారణంగానే ఉద్యోగం కూడా ఊడిన ఘనుడవడం వలన అట్టే శ్రమలేకుండానే విడాకులు మంజూరయ్యాయి దివ్యకు.

తన ముఖం చూడకుండా తనకు మాటమాత్రం చెప్పకుండా తననీ, యింటినీ విడిచి పిల్లలిద్దరినీ చెరోవైపు పెట్టుకుని ఎలాంటి ఆశ, నిరాశ, ఉద్వేగం... ఉద్రేకం లేకుండా ప్రశాంతంగా... నిశ్చలంగా బయటకు సాగిపోతున్న దివ్యను పలుకరించడానికి కానీ, ఆపడానికి కానీ ధైర్యం సరిపోలేదు శ్రీధర్‌కు.

మూడునాళ్ళ ముచ్చటయిన తన వైవాహిక జీవితపు ప్రతిరూపాలను తీసుకుని ముక్కలైన జీవితంలోని మురిపాల్ని వెతుక్కునే ప్రయత్నంలో సాగిపోయింది దివ్య.